ఒకే గ్రామం.. రెండు మండలాల్లో!

- పెద్దదేవుపల్లి రెవెన్యూ త్రిపురారం, పోలీస్ స్టేషన్ పరిధి మాడుగులపల్లి
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పోలీస్‌స్టేషన్ పరిధిని త్రిపురారం మార్చాలని వేడుకోలు



పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ

త్రిపురారం : రెవెన్యూ పరిధి త్రిపురారం మండలం పోలీస్‌స్టేషన్ పరిధి మాడుగులపల్లి మండలంలో ఉండడంతో పెద్దదేవులపల్లి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోలీస్‌స్టేషన్ పరిధిని తిరిగి త్రిపురారం మండలానికి మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో గ్రామం రెండు ముక్కలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కొత్త జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాగా ఉన్నప్పుడు త్రిపురారం మండలంలోనే పెద్దదేవులపల్లి, పూసలపాడ్, గజలాపురం, అభంగాపురం గ్రామాలు కొనసాగాయి. అయితే నూతన మండలాల ఏర్పాటులో భాగంగా సమీపంలో ఉన్న మాడుగులపల్లి గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేశారు. దీంతో అప్పట్లో అధికారులు చేసిన తప్పిదాలకు పెద్దదేవులపల్లి గ్రామస్తులు ఇప్పుడు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాడుగులపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న పూసలపాడ్, గజలాపురం, అభంగాపురం గ్రామాలను త్రిపురారం మండలం నుంచి వేరు చేసి మాడుగులపల్లి మండలంలో కలిపారు. పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ త్రిపురారం మండలంలోనే కొనసాగుతుంది. అయితే పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రధాన వీధి నర్సింహులగూడెంను మాత్రం అధికారులు ఆలోచించకుండా మాడుగులపల్లి మండలంలో కలిపారు. ఇక్కడ నివసించేది పెద్దదేవులపల్లి గ్రామస్తులే. అంతేగాకుండా పెద్దదేవులపల్లి గ్రామం ఇప్పుడు రెవెన్యూ పరంగా త్రిపురారం మండలంలో కొనసాగుతుంటే పోలీస్‌స్టేషన్ పరిధి మాత్రం మాడుగులపల్లి మండలంలో కలిపారు. దీంతో పెద్దదేవులపల్లి గ్రామస్తులు రెవెన్యూ పనుల నిమిత్తం త్రిపురారం మండలానికి, పోలీస్ స్టేషన్ పనుల పరంగా మాడుగులపల్లి మండలానికి వెళ్లి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు.

ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి హామీపైనే గ్రామస్తుల ఆశ

గత ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో పెద్దదేవులపల్లి గ్రామస్తులు మాడుగులపల్లి మండలంలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్ పరిధిని గతంలో మాదిరిగా త్రిపురారం మండలంలో కొనసాగించాలని విన్నవించుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సానుకులంగా స్పందించి మారుస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి చొరవ చూపి పెద్దదేవులపల్లి గ్రామాన్ని పోలీస్ స్టేషన్ పరిధిని మాడుగులపల్లి మండల పరిధి నుంచి తొలగించి త్రిపురారం స్టేషన్ పరిధిలోకి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీస్ స్టేషన్ పరిధిని త్రిపురారం మార్చాలి



కొత్త మండలాలు ఏర్పాటు చేసినప్పుడు పెద్దదేవుపల్లి గ్రామాన్ని మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కలిపారు. కానీ మా గ్రామం రెవెన్యూ పరంగా త్రిపురారం మండలంలోనే కొనసాగుతోంది. వివిధ పనుల నిమిత్తం గ్రామస్తులు కూడా ఎక్కువగా త్రిపురారం మండల కేంద్రానికి వెళ్తుంటారు. కానీ ఏదైనా కేసుల పని నిమిత్తం మాడుగులపల్లికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కావున పోలీస్ స్టేషన్ పరిధిని త్రిపురారం మార్చాలి.

– అంబటి రాము, ఎంపీటీసీ, పెద్దదేవులపల్లి

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం



మిర్యాలగూడ టౌన్ : విగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని వెంకటాద్రిపాలెంలోని గోవిందమాంబ సమేతా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారిలో ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విజయ గణపతి, అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర, సిద్దయ్య, విశ్వేశ్వరస్వామి లింగం, సుబ్రమణ్య, ఆంజనేయ, పోలేరమ్మ, నవగ్రహ మండపాలలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ప్రతిష్ఠాపనకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, తెలంగాణ తొలి శాసన సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, జెడ్పీటీసీ, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, పోదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్‌లు, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నామిరెడ్డి యాదగిరిరెడ్డిలు కూడా స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు వెంకటాద్రిస్వామి, కళాపరిపూర్ణ శ్రీబేతోజు సత్యనారాయణశాస్త్రీ సిద్ధాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అన్నభిమోజు నాగార్జునాచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడు చేర్యాల వెంకటాచారి, అధ్యక్షుడు గడగోజు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి యినుగుర్తి గోవర్ధనాచారి, కోశాధికారి మండలోజు సైదాచారి, ఉపాధ్యక్షులు పోలోజు శ్రీనివాస్, సోల్లేటి నర్సింహ్మాచారి, పయిడిమర్రి గోవర్ధనాచారి, అశోక్‌రెడ్డి, డుకొండలు, వీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు గ్రామంలో. .

మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో బుధవారం శ్రీసీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పన విజయసింహారెడ్డి, నలమోతు భాస్కర్‌రావు, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, నామిరెడ్డి యాదగిరిరెడిలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యిస్కిళ్ల అనందశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ దైద సంజీవరెడ్డి, నూకల భాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, జగదీష్‌చంద్రారెడ్డి, వెంకయ్య, రామలింగయ్య, కృష్ణయ్య, యాదగిరిరావు, కృష్ణయ్య, బొర్రయ్య, రాంబాబు, మల్లయ్య, వెంకటయ్య, ముసలయ్య, వెంకయ్య పాల్గొన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలు

మాడుగులపల్లి : ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినీమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాచనపల్లి గ్రామంలో నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సైతం ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ సైదిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీఫ్లోర్ లీడర్ రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



హాలియా : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి



కొండమల్లేపల్లి : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఉదయ

హాలియా : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ పద్మావతి అన్నారు. బుధవారం హాలియాలోని ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు కార్యాలయంలో నాలుగు మండలాల అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన ప్రాజెక్టు అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యం గా ఎదగాలంటే పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీఓ సువర్ణ, సూపర్‌వైజర్లు రమాదేవి, సరిత, సైదాబేగం, నాగమణి, యాదమ్మ, విజయలక్ష్మి, కమలాబాయి సిబ్బంది పాల్గొన్నా రు.

కొండమల్లేపల్లి : గ్రామపంచాయతీ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉదయ మాట్లాడుతూ మూడేళ్లలోపు పిల్లల్లో శారీరక, మానసి ఎదుగుదలపై అవగాహన కల్పించారు. అందుకుగాను తీసుకోవాల్సిన పోషకాహారం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ, పంచాయతీ కార్యదర్శి గిరిజ, జయేందర్, సురేష్, కోటేశ్, కోట్ల శోభ, జ్యోతి, మాణిక్యమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని కిష్టాపురంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారం కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల వలన కలిగే లాభాల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అలాగే నందిపాడులో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వనజ, గీత, పద్మావతి, పద్మ, లాలీ, కృష్ణవేణి, నాగమ్మ, సరస్వతి, సోనిలతో పాటు చిన్నారులకు చిరుధాన్యాలు, ఆకు కూరగాయాలు, రక్త హీనత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీఆచర్లు నాగమణి, సునిత తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామాలే లక్ష్యం

మిర్యాలగూడ అర్బన్ : కేఎఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని యాద్గార్‌పల్లిలో నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా క్షయ వ్యాధిపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి సూపర్ వైజర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 2023వరకు టీబీని అంతం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంటే భారత దేశం అంతకు ఐదు సంవత్సారాలు ముందుగానే 2025 వరకు అంతం చేయాలని పిలుపును ఇవ్వడం జరిగిందన్నారు. సరైన పద్దతిలో పూర్తికాలం చికిత్సతో ఆరు నెలల లోపు టీబీ తగ్గుతుందని, మాత్రలు వాడటం వలన టీబీని నియంత్రించవచ్చని, నిక్షయ పోషన కింద కేంద్ర ప్రభుత్వం అందించే రూ.500 రూపాయలు చికిత్స కాలం పాటు జమచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య, ఐక్యూసి కో ఆర్డినేటర్ ఈ.రాంరెడ్డి, టీబి జిల్లా సూపర్‌వైజర్ శ్రీనివాస్, కవి, మంగమ్మ, ఎలిజిబెత్, లక్ష్మి, శశికళ తదితరులున్నారు.

సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలి



ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్న వలంటీర్లు

హాలియా : సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలని హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ రవికుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామంలో ఐదో రోజు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి విద్యార్థులు తమవంతుగా సేవ చేయడమనేది సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. తమ పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులు గ్రామంలో వివిధ వ్యాధులపై ఇంటింటా సర్వే చేసి అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం విద్యార్థులు పల్లె దావాఖానను సందర్శించి ఆస్పత్రి ఆవరణ పరిసరాలను శుభ్రం చేసి పాత భవనంలో ఉన్న వస్తువులను కొత్త భవనంలోకి మార్చారు. ఈ కార్యక్రమంలోఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సీహెచ్ రాజు, అధ్యాయపకులు చంద్రకళ, గిరిబా బు, ఆశవర్కర్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రాడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజ్

హాలియా : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్పాలడితే రౌడీ షీటర్లపై చర్యలు తప్పవని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు హెచ్చరించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని హాలియా, నిడమనూరు, త్రిపురారం మండలాలకు చెందిన పలువురు రౌడీ షీటర్లకు బుధవారం హాలియా పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రాజశేఖర్ రాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. నియోజకవర్గంలో వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న నేరస్తులు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్తులు సత్ ప్రవర్తనతో కలిగి ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. హాలియా సీఐ జనార్ధన్ గౌడ్, ఎస్ఐలు సతీష్‌రెడ్డి, గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలని వినతి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరకొండ : జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లలో వర్కర్ల నియామక విషయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేశ్, కంభంపాటి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జిల్లా వ్యాప్తంగా నూతనంగా నియామకమైన వర్కర్ల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. వర్కర్ల నియామకంలో అవినీతి జరిగిందని ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్‌నాయక్, బుడిగ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు సహకరించాలి



నిడమనూరు : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్



మిర్యాలగూడ : వాడపల్లి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

నిడమనూరు: అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలు గురించి వారికి వివరించారు. కోడ్ పాటించాలని, అనుమతులు తీసుకుని సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఫిర్యాదు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నం చినవీరయ్య, మంద తిరుపతయ్య, కున్‌రెడ్డి నాగిరెడ్డి, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలి

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం దామరచర్ల మండలంలోని వాడపల్లి రాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ ప్రాంతంలోకి అక్రమంగా తరలించే మద్యం, నగదు వంటివి రాకుండా పటిష్టంగా తనిఖీలు చేపట్టాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ జవహర్‌లాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన

అడవిదేవులపల్లి : డవిదేవులపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ స్టేషన్‌ను బుధవారం ఆర్డీఓ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అదే విధంగా కస్తూరిబా గాంధీ విద్యాలయంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వసతుల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాలయంలో విద్యార్థినులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అందించాలన్నారు.అదే విధంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట మండల తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ కరుణాకర్‌రావు, ఆర్ఐ శ్యాం, ఎంపీఓ మెసిన్ బిన్ అహ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ అలీ, పంచాయతీ కార్యదర్శి వాసుదేవారెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు



దేవరకొండలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

దేవరకొండ : శాంతి భద్రతల పరిరక్షణకే కవాతు నిర్వహిస్తున్నట్లు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దేవరకొండ పోలీసులు, ఐటీబీపీ కేంద్ర బలగాలు బుధవారం దేవరకొండ పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ కవాతు నిర్వహించాయి. అనంతరం డీఎస్పీ గిరిబాబు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగుండా పోలీస్‌శాఖ పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. డబ్బు, మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు ఇప్పటికే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఐటీబీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

కొండమల్లేపల్లి : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు రాష్ట మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి బాలునాయక్ ఎనలేని కృషి చేశారన్నారు. అదిష్టానం ఆయన సేవలను గుర్తించి మంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎంఏ.సి రాజ్‌ఖాన్, కై సర్‌ఖాన్, పెద్దిశెట్టి సుధాకర్, నీలం శ్రీనివాస్‌యాదవ్, బక్కులు, కోట్ల జగదీశ్, బోడ అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

పెండ్లిపాకలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కొండమల్లేపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పెండ్లిపాకల గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో మెడికల్‌ఆఫీసర్ డాక్టర్ జబ్బార్, సీహెచ్ఓ అన్నమ్మ, హెచ్ఈఓ హవిల్‌కుమార్, రాణి, పాల్గొన్నారు.

తిరందాసు గోపికి నివాళి



నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్ : స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా సీఐటీయు జిల్లా మాజీ అధ్యక్షుడు తిరందాసు గోపి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి చిత్రపటానికి సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చినపాక లక్ష్మీనారాయణ, తుమ్మల వీరారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండా శ్రీశైలం , పాలడుగు నాగార్జున, ఎండీ సలీం, బాణాల పరిపూర్ణచారి, దండంపల్లి సత్తయ్య, పుప్పాల మట్టయ్య, పోలే సత్యనారాయణ, అద్దంకి నరసింహ, సలివోజు సైదాచారి, అవురేషు మారయ్య, పల్లె నగేష్, దాసోజు ప్రభుచారి పాల్గొన్నారు.

పన్ను చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తాం

మిర్యాలగూడ టౌన్ : ఆస్తి పన్ను బకాయిదారులు ఈనెల 31వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లించకుంటే ఆస్తులు జప్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఈదులగూడెంలో పెండింగ్ బకాయిదారులతో పన్నులను చెల్లించాలని కోరారు. ఆస్తి పన్నులు చెల్లించకపోవడంతో ఆస్తులను జప్తి చేసేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధం కాగా రెండు, మూడు రోజుల్లో చెల్లిస్తామని చెప్పడంతో వదిలేశారు. ఆయన వెంట ఆర్ఐలు రాకేష్, రవిలతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం పీఆర్ఓ శ్రీనివాస్‌రావుకు సన్మానం

మిర్యాలగూడ టౌన్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీఆర్ఓగా నియమితులైన సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్‌రావును బుధవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం పూల మొక్క అందజేశారు. 20ఏళ్లుగా జర్నలిస్టు వృత్తిలో రాణిస్తూ నిబద్ధతతో పని చేసిన మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన వారు కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట జి. రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి వినతి

కొండమల్లేపల్లి : పశువుల సంతకు సంబంధించి గ్రామపంచాయతీ అనుమతి లేకుండా వసూలు చేసిన పార్కింగ్ ఫీజును గ్రామ అభివృద్ధికి వినియోగించాలని కోరుతూ పలువురు యువకులు బుధవారం కొండమల్లేపల్లి పంచాయతీ కార్యదర్శి వీరబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి రశీదు లేకుండా సంత కాంట్రాక్టుకు సంబంధించిన ఒక వ్యక్తి దౌర్జన్యంగా పార్కింగ్ ఫీజు వసూలు చేసినట్లు ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో అందుగుల వెంకటేశ్, ఓర్సు శ్రీను, బుడిగపాక కోటయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో

మిర్యాలగూడ : ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై బుధవారం రాస్తారోకో చేపట్టారు. మండలంలోని గూడూరు శివారులో కీర్తి రైస్‌మిల్లు వద్ద సుమారు 50మంది రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ట్రాక్టర్లలో ధాన్యం తీసుకురాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో బుధవారం రాత్రి ధర్నాకు దిగారు. సుమారు గంట పాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మిల్లు యజమానితో మాట్లాడి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

క్లుప్తంగా

23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

త్రిపురారం : ఈ నెల 23న ఎంపీపీ అనుముల పాండమ్మ శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్యప్రభ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు మండలంలోని ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖలకు సంబందించిన మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికతో హాజరుకావాలని కోరారు. అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా సమావేశానికి గైర్హాజరైనట్లయితే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రేపు మినా ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్ మేళా

మిర్యాలగూడ : పట్టణంలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల చైర్మన్ ఎండీ మహమ్మద్‌అలీ, డైరెక్టర్ షహలాబుతుల్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్, డిగ్రీ అర్హత గల విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారికి ఏడాది ఆదాయం దాదాపు రూ.5లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 85209 59390నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : మండలంలోని పులిమామిడి, రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిచిపోనుందని ఏఈ బాలునాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులిమామిడి, రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ తీగలను తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు 132 కేవీ సబ్‌స్టేషన్ ఎర్రబెల్లి నుంచి వచ్చే 33కేవీ పులిమామిడి ఫీడర్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. పులిమామిడి సబ్‌స్టేషన్ పరిధిలోని పులిమామిడి, శ్రీనాధపురం, బంటువారిగూడెం, వెంకటాపురం, మారుపాకతో పాటు రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని రామడుగు, చింతగూడెం, తిమ్మాపురం, కుపాస్‌పల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ గృహ, వాణిజ్య వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి, అధికారులకు సహకరించాలని కోరారు.

ఆర్ఐ బాధ్యతలు స్వీకరణ



ఆర్ఐ శ్యాం

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి ఆర్ఐగా శ్యాం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఠాగూర్ రామకృష్ణ మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ కాగా మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పని చేస్తున్న శ్యాం అడవిదేవులపల్లికి బదిలీపై వచ్చారు.

నర్సరీల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అడవిదేవులపల్లి : మండలంలోని బంగారికుంటతండ, కొత్తనందికొండ, గొన్యాతండాలో ఏర్పాటు చేసిన నర్సరీలను బుధవారం ఎంపీడీఓ పి. కరుణాకర్‌రావు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంపీఓ మెసిన్‌బిన్ అహ్మద్‌లతో పాటు పలువురు గ్రామ పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ అనురాధ

దేవరకొండ : అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి ఆరేళ్లలోపు పిల్లలందరి ఎత్తు, బరువులు చూసి వారి పోషణ స్థితిని గుర్తించాలని దేవరకొండ సీడీపీఓ అనురాధ అన్నారు. బుధవారం దేవరకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో పాల్గొని ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు ఆరేళ్లలోపు చిన్నారులకు సరైన పోషకాహారం అందేలా చూడాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా గర్భిణులు, బాలింతలు తగు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. గిరిజన ప్రాంతాల్లో సాంప్రదాయ వంటకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ ఖతీజాబేగం, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.